# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 10 జూన్ 2026


## చిట్లూరు హరిజనవాడలో త్రాగునీటి సమస్య పరిష్కరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**రామాపురం జూన్ 09 ప్రభాతవార్త:** మండలంలోని చిట్లూరు హరిజనవాడలో ఎన్నో రోజులుగా త్రాగునీటి సమస్య ఏర్పడడంతో రామాపురం మండలం టిడిపి అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టిడిపి కార్య నిర్వాహ కార్యదర్శి వెంకటరమణ ఆ గ్రామ టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి మంగళవారం నాడు బోరు బండిని పంపించి బోరు వేయగా నీళ్లు పుష్కలంగా పడ్డాయి. దీంతో ఆ గ్రామస్తులు ఆనంద ఉత్సవంతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ గారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ సంబరాలు వ్యక్తం చేశారు.



త్రాగునీటి సమస్య వరకు బోరు వేస్తున్న దృశ్యం

## ప్రజలకు అందుబాటులో ఉచిత న్యాయం

**పీలేరు, జూన్ 9 ప్రభాతవార్త :** ప్రజల కోసం న్యాయ సహాయ కేంద్రాలు ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని పీలేరు 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి ఎ. మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేలా చేయడం కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39ఏ మరియు లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం 1987 ప్రకారం ఉచిత న్యాయ సహాయ సేవలు అందించబడుతున్నాయని చెప్పారు. ఈక్రమంలో ఈశాన్య రాష్ట్రాలకు (అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర) చెందిన ప్రజలకు ప్రత్యేకంగా న్యాయ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. న్యాయ సహాయ కేంద్రాల ద్వారా ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు న్యాయసలహాలు, కోర్టు వ్యవహారాల్లో సహాయం, ఉచిత న్యాయవాది సేవలు, అవసరమైన పత్రాల తయారీ, హక్కులపై అవగాహన కార్యక్రమాలు మరియు వివాదాల పరిష్కారానికి మార్గదర్శకత్వం అందించబడుతుందన్నారు. అవసరమైన వారు పీలేరు మండల న్యాయసేవా సమితి, సహింప జిల్లా న్యాయ సేవా సంస్థ, రాష్ట్ర న్యాయసేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయం సహాయం పొందవచ్చని మహేష్ వివరించారు.



11వ జిల్లా అదనపు జడ్జి మహేష్

# చీటీల పేరుతో జనానికి
# రూ.50 కోట్ల కుచ్చుటోపి..?

### పిజిఆర్ఎస్‌లో ఎస్పీకి ఫిర్యాదు
### పోలీస్ స్టేషన్లోనే కొట్టుకున్న ఇరువర్గాలు!!
### పోలీసుల అదుపులో కిలాడి

**రాజంపేట, జూన్9, ప్రభాతవార్త:** కార్పొరేట్ బ్యాంకుల్లో చిన్న ఉద్యోగం చేశాడు. ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేశాడు. జనంతో పరిచయాలు ఉన్నాయి.ఈ పరిచయాలను అడ్డుపెట్టుకొని చీటీలు ప్రారంభించాడు. కోట్ల రూపాయలు అప్పు చేశాడు.జనానికి కుచ్చుటోపి పెట్టాడు. కోటి రెండు కోట్లు కాదు కోట్ల రూపాయల జనం సొమ్ముతో జల్సాలు చేశాడు. చివరకు బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. రాజంపేట మండలం తాళ్లపాక కు చెందిన కంచి నాగేంద్ర అనే వ్యక్తి కోట్ల రూపాయలు చీట్లు వేసి మోసం చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున బాధితులుఅర్బన్ పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. వివరాల్లోకెళ్తే. తాళ్లపాక కు చెందిన నాగేంద్ర ఎల్లాగడ్డలో నివాసం ఉంటున్నాడు. రెండు మూడు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం చేసి పరిచయాలు పెంచుకున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. చీటీలు ప్రారంభించాడు. జనం అతని మాయమాటలు నమ్మి అప్పులు ఇచ్చారు. కోటి రూపాయలు పైబడి అప్పులు ఇచ్చిన బాధితులు కూడా ఉన్నట్లు సమాచారం. గత కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్నాడు .ఐపీఎల్ చివరి ఫైనల్ మ్యాచ్ రోజు పెద్ద ఎత్తున బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం. ఐపిఎల్‌లో పెద్ద ఎత్తున డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో అప్పుల వాళ్ళు చుట్టుముట్టారు. దీంతో చేతులు ఎత్తాడు .మరోవైపు అప్పులు తీసుకున్న వారే చీటీలు సొమ్ము ఇవ్వాలని పట్టు పట్టారు. ఒకవైపు అప్పులు, మరోవైపు బెట్టింగ్లో డబ్బులు పోగొట్టుకోవడంతో ఊపిరి ఆడక తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో సి.ధనుంజయ అనే బాధితుడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. చీటీలు వేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని నాగేంద్ర అతని భార్య విజయలక్ష్మిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశించారు.నాగార్జున నాగేంద్ర ను అదుపులోకి తీసుకొని మంగళవారం విచారించారు. దీంతో విషయం తెలుసుకున్న బాధితులు పెద్ద ఎత్తున రాజంపేట అర్బన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర తరఫున కొంతమంది బాధితులపై ఘర్షణకు దిగారు. పోలీసులు ఎదుటే కొట్టుకునే వరకు వెళ్ళింది. ఈ సందర్భంగా విలేకరులు రాజంపేట అర్బన్ సిఐ నాగార్జునని వివరణ కోరగా పీజీఆర్ఎస్లో ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల లో వార్తలు వచ్చాయని 70 కోట్ల వరకు అప్పులు చేసినట్లు ప్రశ్నించగా పూర్తి విచారణ చేస్తే గాని సమాచారం తెలియదని సిఐ తెలిపారు.




రాజంపేట అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద గుమి కూడిన బాధితులు



పోలీసుల అదుపులో నాగేంద్ర, పోలీస్ స్టేషన్ నుండి ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

### బాధిత కుటుంబాలను లోకేష్ పరామర్శించడాన్ని
## రాజకీయం చేయడం దురదృష్టకరం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లి, జూన్ 9, ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్రమాద బాధిత కుటుంబాలను లోకేష్ గారు పరామర్శించడాన్ని కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. విశాఖ స్టీల్ కర్మాగారం లో చోటు చేసుకున్న దురదృష్టకరమైన సంఘటనలో గాయపడిన బాధితులను మంత్రి లోకేష్ పరామర్శపై కన్నబాబు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమన్నారు.. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలు చేపట్టిందన్నారు. మృతులకు 25 లక్షలు, క్షతగాత్రులకు 10 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించిందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం నిలబడింది. లోకేష్ స్వయంగా వెళ్లి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శ అంటే కేవలం ప్రకటనలు కాదు.. బాధితులకు భరోసా కల్పించడం అని వైసీపీ నేతలు గ్రహించాలి. వైసీపీ నేతలు ప్రజల బాధల్లో కూడా రాజకీయ లబ్ధి చేసుకోవడం, సాక్షి మీడియా ప్రతి దానిని అతిగా చేయడం, జగన్ లాగా వెకిలి నవ్వులు నవ్వడం మానుకోవాలని, ఐదేళ్ల వైసీపీ పాలనలో బాధితులకు న్యాయం జరిగిన సందర్భాలు ఎన్ని? లోకేష్‌కు సహనం లేదని చెప్పే నైతిక హక్కు కన్నబాబుకు లేదు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండి, అవసరమైన సహాయం, పునరావాస చర్యలపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందన్నారు. ప్రజల పట్ల బాధ్యతతో పనిచేస్తున్న నాయకత్వాన్ని విమర్శించడం తగదు, విమర్శలు కాదు. బాధితులకు మేలు చేసే సూచనలు చేస్తే స్వాగతిస్తాం కూటమి ప్రభుత్వం మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తోంది, ప్రజల కష్టకాలంలో అండగా నిలవడం మా ప్రభుత్వ బాధ్యత అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

### స్మార్ట్ కిచెన్‌లతో విద్యార్థుల
## ఆరోగ్యానికి భరోసా!

నాణ్యమైన పౌష్టికాహారంలో రాజీ పడే ప్రసక్తే లేదు

మహిళా మండల సమాఖ్య సభ్యులే ఇకపై సూపర్ మేనేజర్లు

అవగాహన వర్క్‌షాపులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**ఎడ్యుకేషన్, జూన్ 9 ప్రభాత వార్త :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుభ్రమైన, సురక్షితమైన, పోషకాలతో కూడిన వేడివేడి భోజనం అందించడమే స్మార్ట్ కిచెన్‌ల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన వర్క్‌షాపులో జేసీ డా. నిధీ మీనాతో కలిసి ఆయన మాట్లాడారు. స్మార్ట్ కిచెన్ వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపి, ప్రతిష్ఠాత్మక ఖిప్రధానమంత్రి అవార్డుఖి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



**5 ప్రధానాంశాలు: కలెక్టర్ కీలక ఆదేశాలు**

మెనూ కచ్చితం: ప్రభుత్వం ఖరారు చేసిన పోషకాహార వారాంతపు మెనూ (గుడ్లు, ఆకుకూరలు, పండ్లు) బోర్డులను కిచెన్లలో ప్రదర్శించాలి. ఎలాంటి మార్పులూ చేయకూడదు.

ఆధునిక వంట: పోషక విలువలు తగ్గకుండా ఉండేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో ఖిస్టీమ్ కుకింగ్ఖి (ఆవిరి వంట) విధానానికే ప్రాధాన్యత ఇవ్వాలి. నిల్వ ఉంచిన ఆహారం వడ్డించరాదు.

**పరిశుభ్రత రూల్స్:** వంట సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి. ఆప్రాన్, గ్లౌజులు, టోపీలు ధరించాలి. పాత్రలను వేడినీటితోనే శుభ్రం చేయాలి. సూపర్ మేనేజర్లు: ప్రతి మండలంలో మహిళా సమాఖ్య సభ్యులే ఖిసూపర్ మేనేజర్లుఖిగా వ్యవహరిస్తూ సరుకుల కొనుగోలు నుండి పంపిణీ వరకు పూర్తి బాధ్యత వహిస్తారు. బాధ్యతల విభజన: కిచెన్ మేనేజర్ వంట నాణ్యతను చూస్తే, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ హాట్ బాక్సుల ద్వారా పాఠశాలలకు వేడి భోజనాన్ని సమయానికి చేరవేస్తారు.

**డిజిటల్ నిఘాపారదర్శకత కంట్రోల్ రూమ్ సీసీ కెమెరాలు:**

స్మార్ట్ కిచెన్లలో వంట ప్రక్రియ, పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. కిచెన్లలో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. తల్లిదండ్రుల కోసం యాప్: పారదర్శకత కోసం తల్లిదండ్రులకు ప్రత్యేక యాప్ ద్వారా ప్రతిరోజూ మెనూ వివరాలు, వంటకాల ఫొటోలు, వీడియోలను పంపిస్తారు.

**ప్రత్యేక తనిఖీలు:** ఎంఈఓలు, ప్రత్యేక అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిల్లా యంత్రాంగానికి నివేదికలు సమర్పిస్తారు.ఈ సమావేశంలో నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డీఈఓ శంశుద్దీన్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ అధికారులు, మండల సమాఖ్య అధ్యక్షులు, కిచెన్ మేనేజర్లు పాల్గొన్నారు.

### ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన
## రద్దు చేయాలి

**జిల్లా ఫ్యాప్టో చైర్మన్ హేమలత**




**మదనపల్లె క్రైం, జూన్ 9 ప్రభాతవార్త.** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాయాలనే నిబంధనను తక్షణమే రద్దు చేయాలని అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో చైర్మన్ హేమలత డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ హేమలత, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుని, రిటైర్మెంట్‌కు ఐదేళ్ల లోపు సర్వీస్ ఉన్న వారు తప్ప మిగిలిన వారంతా టెట్ రాయాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ గతంలో కఠినమైన డీఎస్సీ పరీక్ష రాసి, మెరుగైన మార్కులు, ర్యాంకులు సాధించిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని గుర్తుచేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులపై ఇప్పుడు మళ్లీ పరీక్షల నిబంధన తీసుకురావడం వల్ల వారిలో అభద్రతా భావం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో ఎన్నో రకాల శాఖలు (డిపార్ట్‌మెంట్స్) ఉన్నాయని, అందరూ అర్హత పరీక్షల ద్వారానే ఉద్యోగాలు సాధిస్తారని.. కానీ ఏ శాఖలోనూ లేని విధంగా కేవలం ఉపాధ్యాయులకే ఉద్యోగంలో చేరిన తర్వాత మళ్లీ టెట్ రాయాలనే నిబంధన పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సీనియర్ ఉపాధ్యాయులు వయోభారం, అనారోగ్య సమస్యలు, పాఠశాలల్లో పని ఒత్తిడి వల్ల ఇప్పుడు కొత్తగా టెట్ పరీక్షకు సిద్ధమవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాబట్టి వారందరికీ దీని నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ నిబంధనను పూర్తిగా రద్దు చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపాలని నాయకులు కోరారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, పార్లమెంటులో అవసరమైన చట్ట సవరణలు తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు మధుసూదన్, రవి ప్రకాష్, పురం వెంకటరమణ, ఆదినారాయణ, విజయ్ కుమార్, నరసింహులు, కడియాలు మురళి, నాగభూషణం, ప్రభాకర్, రమాదేవి, కుసుమ, శివగంగా, సంగీత, వెంకటరమణ, శ్రీనివాసులు, నాగమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అఖిల భారత విశ్వ విద్యాలయాల పోటీలో యోగివేమనకు
## మూడు పతకాలు..



**కడప కార్పొరేషన్ జూన్ 9 ప్రభాతవార్త:** ఈ నెల 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు తమిళనాడులోని హిందుస్థాన్ విశ్వవిద్యాలయంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పురమ, మహిళల పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయానికి మూడు పతకాలు సొంతమయ్యాయి. ఈ పతకాలలో ఒకరు బంగారు, రెండు రజత పతకాలు దక్కాయి. మహిళల విభాగంలో ఎస్ బివియర్ కళాశాలలో మొదట సంవత్సరం డిగ్రీ చదువుతున్న ప్రేరణ 69 కేజీల విభాగంలో క్యాట్ లో 232.5 కేజీలు, బెంచ్ ప్రెస్ 127.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ లో 200 కేజీలు, మొత్తంగా 560 కేజీలుతో బంగారు పతకొన్ని సాధించడమే కాకుండా పోటీల్లో స్ట్రాంగ్ ఉమెన్ గా నిలిచింది. పురుషుల విభాగంలో ఎస్ బి వి ఆర్ కాలేజీలో బీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న మురళి కృష్ణ 59 కేజీల విభాగంలో, స్క్వాట్ లో 257.5 కెజీలు, బెంచ్ ప్రెస్లో 132.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ లో 255 కేజీలు సాభించాడు. మొత్తంగా 645 కేజీలుతో రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. అలాగే ఎన్ సి పి ఈ బద్వేలుకు చెందిన ఖాజావలి 93 కేజీల విభాగంలో స్క్వాట్ లో 325 కేజీలు, బెంచ్ ప్రెస్ లోని 202.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ విభాగంలో 307.5 కేజీలు మొత్తంగా 835 కేజీలు బరువు ఎత్తి రెండవ స్థానంలో నిచిలి రజత పథకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పతకాలు సాధించిన క్రీడాకారులను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, వ్యాయామ విద్యర క్రీడాశాస్త్రాల విభాగాధిపల అండ్ క్రీడాబోర్డు సెక్రటరీ డా. కె.రామసుబ్బారెడ్డి లు సన్మానించారు. ఈ సన్మామ కార్యక్రమములో వ్యాయామ విద్యక్ష క్రీడాశాస్త్రాల విభాగం యొక్క పరిశోధక విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం కారు ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

**పీలేరు, జూన్ 9 ప్రభాతవార్త:** స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో శ్రీ చక్ర హాస్పిటల్ వద్ద కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన మంగళవారం రాత్రి 8 గంటలకు చోటుచేసుకుంది వివరాలు స్థానిక ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన షేక్ షామీర్ (21) సాయిబాబా గుడి వీధికి చెందిన అఖిల్ (18) తిరుపతి మార్గంలో క్రికెట్ ఆడుకుని ఇంటికి వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### టీడీపీ కార్యకర్త కుటుంబానికి
## రూ.5 లక్షల ఆర్థిక సాయం

తులశమ్మకు చెక్కు అందజేసిన శివ మోహన్ రెడ్డి

**పులివెందుల, జూన్ 9, ప్రభాత వార్త :** నియోజక వర్గ పరిధిలోని తొండూరు మండలం గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెద్ద గంగిరెడ్డి మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు టీడీపీ సంక్షేమ నిధి నుంచి విడుదలైన చెక్కును మండల టీడీపీ ఇన్‌చార్జ్ శివ మోహన్ రెడ్డి గంగిరెడ్డి సతీమణి తులశమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా శివ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యమని, వారి కుటుంబాలకు అవసరమైన సహకారం అందించేందుకు పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి నాయకత్వంలో కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంచిరెడ్డి, సుబ్బారెడ్డి, నాగ అంజనేయులు రెడ్డి, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



### అభయ ఆంజనేయ స్వామికి
## వైభవంగా విశేష పూజలు

**బద్వేల్ అర్బన్ జూన్ 09 ప్రభాతవార్త :** అధిక జ్యేష్ఠ మాసమును పురస్కరించుకొని మూడవ మంగళవారం స్థానిక శ్రీ మహాలక్ష్మీ ్మ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి విశే ష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరేశచార్యులు ఆధ్వర్యంలో అభయ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకం, తమల పాకులతో ఆకు పూజ, మరియు సింధూర అర్చన తదితర పలు రకాల విశేష పూజ లను శాస్త్రోక్తంగా జరిపారు.ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకు న్నారు. ఈ విశేష పూజా కార్యక్రమాలకు భక్తులు దాతలుగా వ్యవహరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.



## కుమ్మరపల్లిలో పంచాయతీ కార్యదర్శి చేతివాటం..
### సుమారు మూడు లక్షల పైన స్వాహా..

**రామాపురం జూన్ 09 ప్రభాతవార్త:** మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీలో ఆ గ్రామ పంచాయతీ సెక్రటరీ సుమారు మూడు లక్షలు పైగా స్వాహా చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఆయా పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్‌గా మండల అధికారులను నియమించారు. మండలాధికారులు వారి వారి విధుల్లో నిమగ్నమై ఉండగా మండలంలోని వాళ్ల గ్రామాల్లోని పంచాయతీ సెక్రటరీలు వారి వారి చేతి వాటం ప్రదర్శించుకుంటూ కుమ్మరుపల్లి పంచాయతీలో ఆ గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుమారు 11 లక్షలు పైగా నిధులు డ్రా చేసి అందులో ఎనిమిది లక్షలు రికార్డు పరంగా ఉండగా మిగతా మూడు లక్షల పైగా తన సొంత వెండర్ అకౌంట్‌కు మళ్లించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆ గ్రామ సెక్రటరీకి ఫోన్లో వివరణ కోరగా పొరపాటు అయ్యింది క్షమించండి తప్పు జరిగిన నిధులను వెంటనే పంచాయతీ కౌంటుకు ట్రాన్స్ఫర్ చేస్తానని చెప్పాడు. స్పెషలాఫీసర్ పాలనలో భాగంగా ఎక్కడైనా అవకతవకలు పాలపడతారనే ఉద్దేశంతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజకవర్గంలో అన్ని మండలాల్లో గ్రామాల స్పెషల్ ఆఫీసర్లకు మా అనుమతి లేనిదే నిధులు మార్చవద్దని చెప్పినా కూడా పంచాయితీ కార్యదర్శులు మాత్రం మంత్రి ఆదేశాలు లెక్కచేయకుండా వారి ఇష్టానుసారంగా నిధులు మార్చుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామపంచాయతీ నిధులు పక్కదారి పట్టకుండా వ్యవహరిస్తారని మండలంలోని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఘనంగా ఎస్టీయూ 80వ ఆవిర్భావ దినోత్సవం

### ఎస్టీయూ భవన్‌పై జెండా ఆవిష్కరించిన పోకల మధుసూదన



మదనపల్లె క్రైం, జూన్ 9 ప్రభాతవార్త.

ఉపాధ్యాయుల హక్కుల సాధన, విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయుల మన్ననలు పొందిన రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నేడు 80వ వసంతంలోకి అడుగుపెట్టిందని జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన తెలిపారు. మంగళవారం ఎస్టీయూ 80వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో మదనపల్లెలోని ఎస్టీయూ భవన్ నందు జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎస్టీయూ ప్రముఖ నాయకులు రెడ్డప్ప రెడ్డి, ప్రభాకర్, అశోక్, నరసింహులు, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డి, రమాదేవి, కుసుమ, ఆశాలత, హరీష్, లక్ష్మీనారాయణ రెడ్డి, శివకుమార్, కేశవ కుమార్, వెంకట ప్రసాద్, మనోహర్ రాజు, ప్రకాష్ రెడ్డి, గురునాథం, భావజాన్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువ పోలీసులకు ఆర్.ఐ రామకృష్ణ రోల్ మోడల్

### జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మదనపల్లె క్రైం, జూన్ 9 ప్రభాతవార్త.

విధి నిర్వహణలో నిబద్ధత, నిరంతర శ్రమ ఉంటే ఉన్నత శిఖరాలు దానంతట అవే వరిస్తాయని రిజర్వ్ ఇన్స్పెక్టర్ (ఆర్.ఐ) వి.జె. రామకృష్ణ నిరూపించారని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కొనియాడారు. ఏఆర్ డీఎస్పీగా పదోన్నతిపై చిత్తూరు జిల్లాకు బదిలీ అవుతున్న సందర్భంగా రామకృష్ణకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ డ్యూటీ నిరంతరం సవాళ్లతో కూడుకున్నదన్నారు. ముఖ్యంగా వీఐపీల పర్యటనలు, కీలక బందోబస్తుల సమయంలో ఎలాంటి చిన్న పొరపాటు జరిగినా శాఖకు చెడ్డపేరు వస్తుందని, అలాంటి ఒత్తిడి సమయంలో రామకృష్ణ ఎక్కడా లోపాలకు తావులేకుండా సిబ్బందిని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ అప్రమత్తం చేశారన్నారు. సన్మానం అనంతరం రామ కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా, పనులు సక్రమంగా జరగాలనే ఉద్దేశ్యంతో సిబ్బందిని మందలించి ఉండొచ్చు. కానీ వ్యక్తిగతంగా ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ డి. ఏడుకొండల రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కె. సురేష్ కుమార్ రెడ్డి, ఎం. రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

## ఖాతాల్లోని రూ.1.86 లక్షల నగదు మాయం

### ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



మదనపల్లె క్రైం, జూన్ 9 ప్రభాతవార్త.

బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదు సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.1.86 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మదనపల్లె పట్టణంలోని త్యాగరాజ వీధికి చెందిన గౌస్ అహ్మద్, అతని తల్లి సిరాజున్నీసాల బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.1.86 లక్షల నగదు నాలుగు రోజుల కిందట మాయమైంది. వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించగా, సైబర్ నేరగాళ్లు ఖాతాలను ఖాళీ చేసినట్లు వారు ధృవీకరించారు. నగదు మాయంపై బాధితులు తొలుత వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా, వారు స్పందించలేదని బాధితుడు మంగళవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని కలిసి తన గోడును వెళ్లబోసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ, తక్షణమే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని వన్‌టౌన్ పోలీసులను ఆదేశించారు.

## జూన్ 10న పిల్లల పోషకాహారంపై న్యూట్రిషన్ క్యాంప్



గాలివీడు, జూన్ 9. ప్రభాతవార్త:

6 నెలల పైబడిన చిన్నారుల తల్లిదండ్రుల కోసం జూన్ 10న అయుష్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో టమ్మీటాట్స్ బేబీ న్యూట్రిషన్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వైద్యులు డా. మహేష్, డా. వినూత తెలిపారు. ఈ శిబిరంలో చిన్నారుల పోషకాహారం, ఆరోగ్యకరమైన ఎదుగుదలపై నిపుణుల సలహాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించే లక్ష్యంతో చక్కెర, ప్రిజర్వేటివ్స్ లేని సెరెలవ్ బేబీ ఫుడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే మిల్లెట్స్, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసిన పోషకాహార ఉత్పత్తులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సంకటహార మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠకు 40 రోజులు పూర్తి



పీలేరు, జూన్ 9 ప్రభాతవార్త:

స్థానిక ఇందిరమ్మ కాలనీలో ప్రతిష్ఠించిన సంకటహర మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠకు 40 రోజులు పూర్తయిన సందర్భంగా 41వ రోజున మండల పూజ కార్యక్రమాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పీలేరు సింగల్ విండో అధ్యక్షులు, నేషనల్ మజ్దూర్ యూనియన్ పీలేరు ఆర్టీసీ డిపో అధ్యక్షులు యల్లెల రెడ్డప్ప రెడ్డి, వారి సతీమణి మాంచాలతో కలిసి ఇందిరమ్మ కాలనీ వాసులు, భక్తులతో ప్రధాన అర్చకులు ఉద్యా ఫణీంద్ర కుమార్ శర్మ, ఉద్యా మయూర్ నాథ్ శర్మ, కృష్ణ ప్రసాద్, కిషోర్ స్వామి చే ప్రత్యేక పూజలు, హోమాలు, జపాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లెల రెడ్డప్ప రెడ్డి మాట్లాడుతూ "మహాగణపతి అనుగ్రహంతో గ్రామంలో అందరూ సుభిక్షంగా ఉండాలని, వర్షాలు పుష్కలంగా పడి రైతులు సస్యశ్యామలంగా ఉండాలని, ప్రతి ఒక్కరి సంకటాలు తొలగిపోవాలని" ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రతిరోజు సాధారణ పూజలు జరుగుతూ ఉంటాయని వారు తెలిపారు.

## సురక్షిత మాతృత్వానికి ఆరోగ్య సూచనలు తప్పక పాటించాలి : వైద్యురాలు శ్రీగిరీష



పీలేరు జూన్ 9 ప్రభాతవార్త:

బలమైన ముందుతరం ఆరోగ్యకరమైన గర్భిణీ స్త్రీలపై ఆధారపడి ఉంటుందని,పి.హెచ్.సి తలుపుల ప్రధానవైద్యాధికారులు శ్రీగిరీష, చంద్రశేఖర్ నాయక్ సంయుక్తంగా తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలకు వ్యాధుల నిర్ధారణకై రక్త, మూత్ర, అధిక రక్తపోటు పరీక్షలు చేసి మందులు పంపినిచేశారు. పి.యం.యస్.యం.ఏ కార్యక్రమం 10 సం: పూర్తి చేసుకొని పొందిన మాతృత్వ ఫలితాలను అధికారులు ఈ సందర్భంగా గర్భిణీలకు వివరించి, ఉత్తమ గర్భిణీస్త్రీలకు శాలువా పూలమాలతో సత్కరించారు, సురక్షిత మాతృత్వానికి, ఆరోగ్యకరమైన సూత్రాలు పాటిస్తామని ప్రతిజ్ఞ కూడా చేశారు. స్థానిక పిహెచ్సిలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ ్మ (ఎఫ్ఎన్.ఓ) సహ కారంతో సేవలకు హాజరైన 29 మంది గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, పీహెచ్ఎన్ కుసుమ, పర్యవేక్షకులు ఉమా, నాగమ్మ ,ఏఎన్ఎం పామున్నిసా, నాగవేణి, ప్రమీల, సిహెచ్ఓ కుముదా, ఆశా కార్యకర్తలు,గర్భిణీ స్త్రీలు, పాల్గొన్నారు.

## కురుబ సంఘం విద్యార్థుల ప్రతిభా పురస్కార మహోత్సవం



పీలేరు జూన్ 9 ప్రభాతవార్త:

పీలేరు మండల కురుబ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం విద్యార్థుల ప్రతిభా పురస్కార మహోత్సవం అత్యంత వైభవంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఉదయం 10:30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ సమాజ చైతన్య సదస్సుకు మండల నలుమూలల నుండి కురుబ సమాజ సముదాయం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**ప్రతిభకు పట్టాభిషేకం – 28 మందికి పురస్కారాలు:**

ఇటీవల విడుదలైన ఫలితాల్లో సమాజానికి గర్వకారణంగా నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఈ వేదికపై ఘనంగా సత్కరించారు. పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించి రికార్డు సృష్టించిన 20 మంది విద్యార్థులకు మరియు ఇంటర్మీడియట్‌లో 900 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు సంఘం ప్రతినిధులు, అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించి ప్రతిభా పురస్కారాల్తో సత్కరించారు.

**చదువే సమాజంలో మన అస్త్రం: కోట లీలారాణి**

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన కోట లీలారాణి గారు (లీలి పూతలపట్టు డిపో ఉన్నత అధికారి మాట్లాడుతూ.. "నేటి పోటీ ప్రపంచంలో చదువు ఒక్కటే సమాజంలో మనకు ప్రత్యేక గుర్తింపును, విలువను తెచ్చిపెడుతుంది. విద్యార్థులు చదువును భారంగా కాకుండా ఇష్టంగా భావించి, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి. అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి సేవ చేయగలరు" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

**కీలక దశను సద్వినియోగం చేసుకోండి: డాక్టర్ రోజా రాణి**

ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రోజా రాణి గారు (జూనియర్ లెక్చరర్) ప్రసంగిస్తూ.. "పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలోనూ టర్నింగ్ పాయింట్ (కీలకమైన దశ). ఈ దశలో మనం నిర్దేశించుకునే లక్ష్యాలే మన భవిష్యత్తును శాసిస్తాయి. ప్రారంభించిన ప్రతి పనిని పట్టుదలగా పూర్తి చేసినప్పుడే జీవితంలో విజయం సాధ్యమవుతుంది. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఉన్నత ఆశయాలతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

**తరలివచ్చిన ప్రముఖులు – సంఘీభావం..:**

ఈ మైలురాయి లాంటి కార్యక్రమానికి కురుబ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కలకడ మాజీ ఎంపీపీ కాంతారావు , రఘు , జనార్ధన్ గౌడ్ , శివ, పీలేరు మండల అధ్యక్షులు వసంత రాజా , ప్రధాన కార్యదర్శి హితేష్ నాయకత్వం వహించారు. పీలేరు మండల కమిటీ సభ్యులతో పాటు పొరుగు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కూడా హాజరై సంఘ బలాన్ని చాటారు. అలాగే పీలేరు మండలానికి చెందిన కురుబ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సమాజ పెద్దలైన ఆర్థిక కార్యదర్శి సిద్దయ్య , కృష్ణమూర్తి లక్ష్మీ ్మనారాయణ, శివ శంకర్ , రెడ్డప్ప ఎక్స్ మిలిటరీ రమణ బాబు , రిటైర్డ్ ఎస్ఐ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌లో మృతిచెందిన కార్మికులకు కోటిపరిహారం చెల్లించాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



మదనపల్లె, జూన్ 9 ప్రభాతవార్త :

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో 8మంది కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ప్రతి కుటుంబానికి కోటి రుపాయలు పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి వైద్యసేవలు అందించి పూర్తి ఆరోగ్యం పొందేవరకు అన్ని వైద్యఖర్చులు భరించాలన్నారు. పరిశ్రమల్లో కార్మిక భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయకపోవడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మద్యం గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలకు భద్రత లేదన్నారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికుల ప్రాణాలు, హక్కులు, భద్రత కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, హమాలీలు సురేష్, సుధాకర్, హేమంత్, కుబేరన్, విజయకుమార్, మనోహర్, శివకుమార్, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం వద్ద ప్రధాని మోడీ ఫోటో ఆవిష్కరణ



లక్కిరెడ్డిపల్లి: మే 9 ప్రభాత వార్త

భారత ప్రధాని గా 12 సంవత్సరాలు అత్యధిక పదవీ కాలం విధులు నిర్వహిస్తున్న శుభ సందర్భంగా నరేంద్ర మోడీ చిత్రపటాన్ని లక్కిరెడ్డిపల్లి బిజెపి నాయకుడు కొర్లకుంట కృష్ణ, మండల మాజీ అధ్యక్షులు కె జయచంద్ర నాయుడు, ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక పదవి కాలం లో దేశ ప్రజలకు ఉన్నతమైన సేవలు అందిస్తు మన రాష్ట్రానికి అత్యధిక రుణాలు అత్యధిక నిధులు కేటాయించి ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత స్థాయిలో నిలపడానికి సహకరిస్తున్న నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, కూటమి నాయకులు బీజేపీ మండల ఇన్చార్జి బాలాజీ యాదవ్, బుర్ర రాజశేఖర్ రెడ్డి, జయచంద్ర నాయుడు, బిసి నాయకులు విజయభాస్కర్, యమనల విశ్వనాథ్, మాజీ సర్పంచులు కేశవయ్య, లక్ష్మీనారాయణ, మైనారిటీ నాయకులు, పఠాన్ సాధుల్లా ఖాన్, ముక్తియార్, బీజేపీ నాయకులు చెంచర్ల ఆంజనేయులు, మసూద్, అన్వర్ డీలర్, జయచంద్ర నాయుడు,చంద్ర నాయుడు, బుజ్జి టైలర్, పి రామచంద్ర (ఎల్ఐసి) కే లక్ష్మీ ్మనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి లో కాన్పు తల్లీ, బిడ్డకు క్షేమం

### డాక్టర్ రమేష్ బాబు



వాల్మీకిపురం జూన్ 9 ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం తల్లీ, బిడ్డకు క్షేమం అని మదనపల్లి జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (పి.ఎమ్.ఓ)డాక్టర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం మండలం లోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమమును ఆకస్మికంగా తనిఖీ చేశారు.కాన్పు గదిని తనిఖీ చేసి ప్రతీ నెల పది కాన్పులు చేయాలని ఆదేశించారు.త్వరలో జిల్లా లో సంజీవని కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుంది అన్నారు. ఇందుకొరకు ఐ.టి. డేటా సేకరించడం జరుగుచున్నాదని అన్నారు.

## పునీత అంతోని దేవాలయం వార్షికోత్సవానికి సూర్యనారాయణ రెడ్డికి ఆహ్వానం



బద్వేలు అర్బన్, జూన్ 9, ప్రభాతవార్త

బద్వేల్ పట్టణంలోని మైదుకూరు రోడ్డులో వెలసిన పునీత అంతోని వారి దేవాలయం నాలుగవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా, రెవరెండ్ ఫాదర్ గొల్లపల్లి చిన్నప్ప మరియు దేవాలయ కమిటీ సభ్యులు డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిని నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వేడుకలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఫాదర్ గొల్లపల్లి చిన్నప్ప మరియు కమిటీ సభ్యులు సూర్యనారాయణ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పునీత అంతోని వారి దేవాలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, చర్చి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. నాలుగవ వార్షికోత్సవ వేడుకలు ఘన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, విశ్వాసులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## హనుమదక్షత స్కిల్ సమ్మర్ క్యాంపులో సర్టిఫికెట్లు పంపిణీ



చిన్నారికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, జూన్ 9 ప్రభాతవార్త :

పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ భరోడా మిద్దిపై ఉన్న హనుమదక్షత ఇవాల్వింగ్ స్కిల్స్ వారు సమ్మర్‌క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో దాదాపు 100మంది పిల్లలకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని ప్రసంగించారు. హనుమదక్షత ఎవాల్విన్స్ స్కిల్స్ ప్రారంభించి కేవలం ఒక ఏడాది పూర్తియిన దాదాపు 15 బ్యాచ్ పిల్లలు కంప్యూటర్ స్కిల్స్ నేర్చుకోవడం అభినందనీయమన్నారు. కంప్యూటర్ విద్యతో పాటు ఏఐ టెక్నాలజీ, ఇతర కోర్సులను నేర్పడం సంతోషకరమన్నారు. పాఠశాల అధినేత రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ మా సంస్థలో కంప్యూటర్ శిక్షణ తక్కువ ధరకే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఏఐ స్కిల్స్ నేర్పించడం జరుగుతుందన్నారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ పిల్లలు చెడు మార్గాలు ఎంచుకోకుండా కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్ అందించి వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం గర్వకారణమన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా 100మంది విద్యార్థిని, విద్యార్థులకు సమ్మర్ క్యాంపు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అనుమతిక్షత ఇవ్వాల్వింగ్ స్కిల్స్ ఫౌండర్, ఛైర్మెన్ కరమల చరణ్‌తేజ్ ముఖ్య అతిథులు ఎమ్మెల్యే, జ్ఞానోదయ పాఠశాల కామకోటి ప్రసాద్‌రావు, రఘునాథ్‌రెడ్డి, హ్యూమన్‌రైట్స్ ఛైర్మెన్ వేణుగోపాల్‌రెడ్డిలకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైతన్యసంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి, అడ్మిన్ డాక్టర్ సుబ్రమణ్యం, యోగా మాస్టర్ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విఆర్‌ఓ మృతికి కారుకులైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలి

### కలికిరి వీఆర్వోల సంఘం వినతి



పీలేరు,జూన్ 9, ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని కలికిరి మండల పరిధిలో ఉన్న వీఆర్వోలు వీఆర్ఏలుతో కలిసి తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ సయ్యద్ అహ్మద్‌కు మహమ్మద్ హుస్సేన్ మృతికి కారుకులైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్వో సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పని ఒత్తిడితో రెవెన్యూ సేవలలో తలమునుగలై వివిధ రకాల సమస్యలను పరిష్కరించడమే కాకుండా రోజురోజుకు పెరుగుతున్న పని ఒత్తిడితో పనులు చేయలేక ఆత్మహత్యకు ప్రేరేపించిన మహమ్మద్ హుస్సేన్ మృతికి కారకులైన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కలికిరి వీఆర్వోలు వీఆర్ఏల సంఘం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు ప్రసాద్ రెడ్డి, నరేంద్ర కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, నరేష్, వీఆర్ఏలు మల్లికార్జున, నరేష్, ఎల్లారెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విశేష పూజలు

మొదటి పేజీ తరువాయి



ప్రత్యేక అభిషేక దాతలుగా కనక్కాయ శ్రీనివాసులు, వారి సతీమణి విజయలక్ష్మీ ్మ కుటుంబ సభ్యులు. తులసి వెంకట శివ నారా యణ సతీమణి ఇందుమతి, గొడిసి పాటి అంకయ్య సతీమణి రుక్మిణ మ్మ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వ హించి తీర్థ ప్రసాదాలను అందజేశారు, ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాల వితరణ గావించారు. ఆలయ ప్రాంగ ణం అంతా హనుమాన్ చాలీసా పారాయణాలతో, భక్తి శ్రద్ధలతో మారుమోగింది.

## నలుగురు జూదరులు అరెస్ట్

దువ్వూరు, జూన్ 9, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నేలటూరు గ్రామ పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4500 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని వారి వద్ద నుంచి జూదానికి సంబంధించిన పేక ముక్కలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

## కుల మతాలకు అతీతంగా అభివృద్ధి చేసిన ఘనత వైయస్సార్ పార్టీదే

### వైసిపి నాయకులు హరీష్ రెడ్డి



వైసిపి నాయకులు హరీష్ రెడ్డితో కాలనీ చిన్న

పీలేరు జూన్ 9 ప్రభాతవార్త:

పీలేరు నియోజకవర్గ పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కులాలకు మతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలే ధ్యేయంగా జరిగాయని అదే విధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులకు కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించిన వైయస్సార్ పార్టీతో ఎంతో మందికి ఎన్నో రకాల అభివృద్ధి దశలో పయనించేందుకు తోడ్పడ్డారని పీలేరు ఎస్టి సంఘం నాయకులు చిన్నా తెలిపారు.మంగళవారం హరీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తన స్వగృహంలో మదనపల్లిలో కలిసిన అనంతరం ఇరువురు మధ్య నియోజకవర్గాల్లో కులాలు మతాలు అని తేడా లేకుండా అందరికీ సముచిత స్థానంగా పదవుల కట్టబెట్టిన ఘనత వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డి దేనని ,పేదలకు చేయూతనిచ్చే నాయకుడిగా రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి చేయూతను అందిస్తున్నారని ,అందరికీ ఆదర్శంగా అందరితో కలపగోరుతనంగా అందరిని ఆదరించే వ్యక్తిగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో పీలేరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి పార్టీని అభివృద్ధి వైపు తీసుకు వెళ్లేందుకు ముందుకు వెళుతున్నారని చిన్న అన్నారు.

## నవ చేతన యాప్ ద్వారా బాల రక్షణ బాధ్యత తీసుకోవాలి : సిడిపిఓ సుజాత



తంబళ్లపల్లె జూన్ 9 ప్రభాతవార్త

అంగన్వాడి కార్యకర్తలు నవ చేతన యాప్ ద్వారా బాలల ఆరోగ్యంతో పాటు రక్షణ బాధ్యత తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత సూచించారు. మంగళవారం జడ్పీ హైస్కూల్లో నవచేతన యాప్ లో భాగంగా 0 నుండి6 ఏళ్ళ పిల్లల అభివృద్ధి పై ఈసీడి శిక్షణ తరగతులు జరిగాయి. సిడిపిఓ మాట్లాడుతూ 0 నుండి 6 ఏళ్ల పిల్లల ఆరోగ్యం, న్యూరో సైన్స్, పోషణ మరియు అభివృద్ధి దశలవారిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నవ చేతన యాప్ లో అంగన్వాడీలకు బాలల రక్షణ భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు విశదీకరించారు. స్క్రీనింగ్ చేయబడిన 5 అభివృద్ధి దశలు గురించి ఐసిడిఎస్ సేవల ఉదేశాలు తెలియజేశారు. ఎంఎల్ హెచ్ ఓ నవ చేతన ఆర్పి ఎస్కే 4 డిఎస్ ఫ్రేమ్ వర్క్ అభివృద్ధి గుర్తించి పిల్లలకు అభివృద్ధి భాగాలలో స్క్రీనింగ్ చేసి డిజిటల్ సాధనాన్ని ఉపయోగించేలా సాధికారిత చేయాలని ఉపదేశించారు. ఎంఈఓ నాగ సుబ్బరాయుడు నవ చేతన యాప్ ప్రయోజనాలను సభ్యులకు కూలంకశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు రమణమ్మ,చంద్రకాంత, నాగలక్ష్మీ ్మ,భారతి అంగన్వాడీలు, వైద్యసిబ్బంది

## రెచ్చిపోతున్న మట్టి మాఫియా

### ఖండించిన బీజేపీ కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి



కడప, జూన్ 9, ప్రభాతవార్త:

కమలాపురం నియోజకవర్గం మాచనూరు, నందిమండలం, అలిదిన, పగిడాలపల్లె, జాల్పల్లె, కొండపేటలలో మట్టి, గ్రావెల్, నల్ల మట్టి మాఫియా రెచ్చిపోతోందని బీజేపీ కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఏకంగా కోట్ల విలువైన మట్టి, ఇసుక అక్రమంగా తరలించారన్నారు. ఈ దందాను బీజేపీ జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి తీవ్రంగా ఖండించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కోట్లాది రూపాయల మట్టి, గ్రావెల్ తవ్వకాలు బహిరంగంగా జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నా సామాన్యుడు ఇంటి అవసరానికి మట్టి తీసుకెళ్తే నానా ఇబ్బందులు పెట్టే రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఈ అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? వెంటనే జిల్లా మైనింగ్ శాఖ స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై మైనింగ్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. రివకీ చేయాలి తక్షణమే అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మైనింగ్ యాక్ట్‌ను అనుసరించి రికవరీ చేయాలన్నారు. మట్టి మాఫియా ఆగడాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలన్నారు. కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా కూడా యథేచ్ఛగా మాఫియా ఆగడాలు ఆగడం లేదంటే వారి ధైర్యం ఏంటి వెనక ఎవరు ఉన్నారు, దీనిపై కలెక్టరు చొరవ తీసుకొని వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తహశీల్దార్ మాదవి



మదనపల్లె, జూన్ 9 ప్రభాతవార్త :

మదనపల్లె నూతన తహశీల్దార్‌గా బాధ్యలు స్వీకరించిన టి.మాదవి మంగళవారం జిల్లా జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాదవి జిల్లాకలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని రెవెన్యూశాఖ పనితీరు, ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జిల్లా అభివృద్ధి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పేనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మృతులకుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



మదనపల్లె, జూన్ 9 ప్రభాతవార్త :

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో 8మంది కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అవెన్యూరోడ్డులోని వైకాపా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ప్రతి కుటుంబానికి కోటి రుపాయలు, క్షతగాత్రులకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని, మృతుని కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి పూర్తి ఆరోగ్యం పొందేవరకు అన్ని వైద్యఖర్చులు భరించాలన్నారు. ఈ ప్రమాదంలో 8మంది మృతి చెందడం చాలా భాకరమని తెలిపారు. పరిశ్రమల్లో కార్మిక భద్రతా ప్రమానాలను ఖచ్చితంగా అమలు చేయకపోవడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలని చూస్తూ తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆరకొర సిబ్బందితో స్టీల్‌ప్లాంట్‌ను నడుపుతోందని అన్నారు. ఉన్న సిబ్బంది అదనపు పనిభారంతో తీవ్ర ఆందోళన మధ్య పని చేస్తున్నారని తెలిపారు. సిబ్బందిని పెంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవాన్ని తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జింకా వెంకటా చలపతి, విఎస్.రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పేరు, పుట్టిన తేదీ మార్పిడి**

నా పేరు ఆర్. జయపద్మ, పుట్టిన తేదీ 16 ఏప్రిల్ 1983గా ఆర్మీ రికార్డు నెంబర్ జె.సి. 442193 ఏ, నా భర్త రామక్క గారి బాపూజీగా నమోదు అయ్యింది. నా వద్ద ఉన్న ఆధార్ కార్డు ప్రకారం నా పేరు, పుట్టిన తేదీను మార్చుకుంటూ ఆర్.జయపద్మకు బదులుగా మేజారి జయపద్మ, 16 ఏప్రిల్ 1983గా ఉండేదాన్ని 16 ఏప్రిల్ 1982గా ఆధార్ కార్డు ప్రకారం మార్చుకోవడం జరిగింది.

# పదవి రాలేదని అసంతృప్తితో పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయడం తగదు

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 9 ప్రభాతవార్త :**

తమ వ్యక్తిగత రాజకీయ అసంతృప్తులను జనసేన పార్టీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై విమర్శల రూపంలో వ్యక్తపరచడం సరికాదని జనసేన నాయకుడు మంచి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభ అవకాశం దక్కకపోయిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం రాజకీయ పరిపక్వతకు నిదర్శనం కాదన్నారు. ఆర్‌అండ్‌బీ బిల్లులు లేదా ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత శాఖ మంత్రులను ప్రశ్నించాలే తప్ప, వాటికి సంబంధం లేని పవన్ కళ్యాణ్‌ను విమర్శించడం సమంజసం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ కడప జిల్లాలో జనసేనకు తగిన రాజకీయ ప్రాధాన్యం దక్కలేదని, అయినప్పటికీ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కార్యకర్తలు, నాయకులు సంయమనంతో వ్యవహరించారని తెలిపారు. కూటమి బలోపేతం కోసం ఎన్నో సందర్భాల్లో మౌనం పాటించామని, దానిని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. జనసేన కార్యకర్తలు పదవుల కోసం కాకుండా ఆత్మగౌరవం, ప్రజాసేవ కోసం పనిచేస్తున్నారని శివకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవహారాలపై విమర్శలు చేసే ముందు సంబంధిత మంత్రులు, అధికారులను ప్రశ్నించాలని సూచించారు. రాజకీయాల్లో పదవి రాకపోవడం సహజమేనని, అయితే ఆ అసంతృప్తిని మిత్రపక్షాలపై ఆరోపణల రూపంలో చూపించడం సరైన విధానం కాదన్నారు. వాస్తవాలను పక్కనబెట్టి జనసేన పార్టీపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బాబ్జి, సంజీవ్, నాగమునెయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.



# తహసిల్దార్‌ను కలిసిన నాయకులు

**వేంపల్లె జూన్ 09 ప్రభాతవార్త**



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ జిల్లా శివ శంకర్ రెడ్డిను స్టేట్ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ ఎస్ ఎండి షబ్బీర్, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి( దిల్ మాంగే) కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం తహసిల్దార్‌కు అభినందనలు తెలియజేసి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, యం. గంగాధర్, మహమ్మద్ అలీ ( సెట్ ) ఇమ్రాన్, మంజు, నరసింహ, (ఖాసీం వల్లి, బిల్లా)కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి సభ గ్రాండ్ సక్సెస్



**వేంపల్లి జూన్ 09 ప్రభాతవార్త**

కాంగ్రెస్ నేతృత్వంలో సోమవారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన ఇండియా కూటమి లోని 25 పార్టీల సభ గ్రాండ్ సక్సెస్ కావడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2029 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ కూటమిని ఓడించి కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో ఇండియా కూటమి పని చేయడం ఆనందదాయకమన్నారు. చంద్రబాబుది రైతు వ్యతిరేక ప్రభుత్వం తమది రైతు ప్రభుత్వం అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని తులసి రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షులు రామాంజనేయరెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షులు వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమా రాజా తదితరులు పాల్గొన్నారు.

# జన్నునాగుతో ప్రజలకు తప్పని తిప్పలు

## -కంటి సమస్యతో కష్టాలు



కాంప్లెక్సు వెనుకభాగంలో వున్న జన్ను ఇన్‌సెట్‌లో నూగు

**చౌడేపల్లి, జూన్ 9 ప్రభాతవార్త**

జన్నునూగుతో పట్టణ ప్రజలు తంటాలు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాలి వీచేదిశగా జన్నునూగు కళ్ళల్లో పడి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో నూతన కాంప్లెక్సు వెనుక భాగంలో జన్ను విస్తారంగా వుంది. అది ఎండిపోయి అందులోంచి నూగు గాలి వాటం వైపు వస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంతోపాటు పట్టణంలోని బస్టాండు, ఎంపిడిఓ కార్యాలయ సముదాయం, వరదా కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లో నూగు వస్తోంది. జన్నునూగు కళ్ళల్లో పడుతుండటంతో కంటి సమస్యలను ఎదుర్కొనవలసి వస్తోందని ప్రజలంటున్నారు. అంతే కాకుండా తిను బండారాలు, హోటళ్ళల్లో నూగు చేరి మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. అధికారులు స్పందించి జన్నునూగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో కీలకం

**మదనపల్లి జూన్ 9 ప్రభాతవార్త**

జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో కీలకం. సమాజ ఆర్థికాభివృద్ధి తోపాటు జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం మదనపల్లి కలెక్టరేట్లోని బీసీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్స్ సమావేశ నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు జిల్లాలోని అన్ని బ్యాంకులకు 2025, 26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని, 2026, 27 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలు పై డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కు సంబంధించిన అజెండా వివరాలను, ఆయా అంశాలలో బ్యాంకుల సాధించిన ప్రగతిని కలెక్టర్‌కి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమన్నారు. ఇందులో భాగంగా 2026, 27 కు రూ.18,013 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక ఆమోదించడం జరిగిందన్నారు. ఇందులో ప్రాధాన్యత రంగానికి రూ.14503కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.12,654 కోట్ల కేటాయించడం లక్ష్యమన్నారు. కేటాయించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు తప్పనిసరిగా అధిగమించాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన కల్పించాలని ఎల్డీఎంకు సూచించారు. మహిళా సంఘాలకు రుణకల్పనలో వందశాతం ప్రగతి సాధించారని, పీఎంఈజిపి పథకం కింద లక్ష్యాన్ని మించి గ్రౌండ్ అయిన 221 యూనిట్లకు రూ.9.36కోట్లు, ముద్ర రుణాల కింద 26242 యూనిట్లకు రూ 536.53కోట్లు రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. గ్రామాల పరిధిలో బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్ర, గ్రామీణ ఖాదీబోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు.. పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. అర్హులైన చేనేతలకు, మత్స్యకారులకు రుణాలు అందించి ఆర్థికంగా చేయుతనివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు, ఏఎల్‌డిఎం మంజునాథ్, నాబార్డ్ డి డి ఎం పృధ్వి, ఆర్బిఐ ఎల్డీఓ పై. ఎలమంద, యూనియన్ బ్యాంక్ ఆర్ ఎం తులసి, వివిధ బ్యాంక్ మేనేజర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్కూటర్ అదుపు తప్పి గాయాలు

**సుండుపల్లె, జూన్ 09,ప్రభాతవార్త :**



మండల పరిధిలోని నాగారపమ్మ జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయవడ్డారు. వివరాల్లోకి వెళితే పెదినేనికాలువ బండకాడ ఈడిగపల్లెలో నాగారపమ్మ జాతరకు వెళ్లిన మల్లిఖార్జున, ఆసిఫ్, బాబ్జాన్ స్కూటర్‌పై తిరిగి వస్తుండగా బూడిదేటిపల్లె సమీపంలో స్కూటర్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో పీలేరు ఇందిరమ్మ కాలనీకి చెందిన మల్లిఖార్జున (26) సుండుపల్లెకు చెందిన ఆసిఫ్ (16) తీవ్ర గాయాలు బాబ్జాన్ (22)కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడ్డ వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గర్భిణీలకు పౌష్టికాహారం



**బ్రహ్మంగారిమఠం జూన్ 9 ప్రభాతవార్త**

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిమఠం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకట స్వాముల వారి ఆదేశాల మేరకు మేనేజర్ ఈశ్వరయ్య చారి ఆధ్వర్యంలో మండల ప్రాథమిక వైద్యశాల నందు గర్భిణీలకు పౌష్టికాహారం డాక్టర్ సంపత్ కుమార్ చేతుల మీదుగా గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం ఆధ్వర్యంలో ప్రతినెల 9 తేదీన గర్భిణులకు పౌష్టిక ఆహారమైన పులిహోర, పెరుగన్నం గుగ్గులు వంటి పౌష్టికాహారాన్ని అందించడం చాలా సంతోషకరమైన విషయం అని ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చేస్తున్న మఠం యాజమాన్యానికి వైద్యశాల బృందం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల

# ధరలు తగ్గించాలంటూ నిరసన





**బద్వేలు, జూన్ 9, ప్రభాతవార్త**

వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం మానవహారం నిర్వహించి, పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్ బాషా పాల్గొన్నారు. 12 సంవత్సరాల నరేంద్ర మోడీ ప్రభుత్వం ద్వారా పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపు అయ్యాయని, కేంద్ర, రాష్ట్ర పన్నులే సగానికి పైగా ఉన్నాయని గుర్తు చేశారు. వామపక్షాలు ప్రభుత్వాలపై సీరియస్ విమర్శలు చేసి, కూటమి ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ప్రజలకు తగిన న్యాయం అందించకపోతే, 2029 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు రెండింటికీ శిక్ష చూపిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఏరియా సమితి నాయకులు కె. బాబు, విజయరావు, సిహెచ్. నరసింహులు, గంటా మహబూబ్ భాష, సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె. శీను, పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోసారి రక్తదానం చేసిన శ్రీనివాసులు

**బద్వేల్ అర్బన్, జూన్ 09 ప్రభాతవార్త:**



ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు మున్సిపాలిటీ వాటర్ సెక్షన్ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసులు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. నేడు ఆరోసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. స్థానిక హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఒక మహిళకు రక్తం అత్యవసరంగా కావాలని గ్రూపులో వచ్చిన సందేశాన్ని శ్రీనివాసులు చూశారు. స్పందించిన ఆయన హాస్పిటల్‌కు చేరుకుని రక్తదానం చేశారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణ రక్షణకు తోడ్పడిన శ్రీనివాసులును హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు డాక్టర్ కోటా సుమన్, డాక్టర్ వై.వి. సరస్వతి ప్రత్యేకంగా అభినందించారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్

# ధరల పెంపుపై రోడ్డెక్కిన సిపిఐ



**వేంపల్లి జూన్ 09 ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నిరసిస్తూ వామపక్ష పార్టీలు మంగళవారం వేంపల్లి అంబేద్కర్ సర్కిల్లో రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు అంబేద్కర్ సర్కిల్లో ఆటోను తాళ్లతో కట్టి ఈడ్చుతూ, గ్యాస్ బండను మోస్తూ వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం 11 రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ధరలను రూ.10కు పైగా పెంచిందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని, ఎరువుల ధరలను తగ్గించి రైతులకు అందుబాటులో ఉంచాలని, ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శులు బ్రహ్మం, అంజన్నప్ప, సిపిఐ వేముల మండల కార్యదర్శి చాంద్ భాష ఏఐటియుసి ఏరియా కోశాధికారి బత్తల మల్లేష్ ఆమ్ ఆద్మీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా జిల్లా కో కన్వీనర్ దాదా పీర్ నాయకులు ఎస్ఎండి గౌస్ అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటన

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే





**బద్వేలు, జూన్ 9, ప్రభాతవార్త**

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కారణంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నిన్నటిరోజు ఘోర ప్రమాదం జరిగింది. 120 టన్నుల ఉక్కు ద్రావణం ఉప్పొంగిన ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మరణించారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు సంగటి చంద్రశేఖర్ అన్నారు. చంద్రశేఖర్ ఈ ఘటనను దురదృష్టకరమని పేర్కొని,"ఇది కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని" తెలిపారు. ఆయన, ప్రమాదం తర్వాత పవన్ కళ్యాణ్ ప్రెస్ మీట్లు, నారా లోకేష్ పర్యటనలు నిర్వహించడం ప్రభుత్వ వైఫల్యాలను మసకబార్చే ప్రయత్నమేనని విమర్శించారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్ ప్రకారం, చనిపోయిన ప్రతి కార్మికుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగం, గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం, ప్రతి గాయపడిన కార్మికునికి 10 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని కోరారు. చంద్రశేఖర్, కేంద్రం ద్వారా మరణించిన వ్యక్తులకు కేవలం రెండు లక్షలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు ఇవ్వడం తగిన పరిష్కారం కాదని, కూటమి ప్రభుత్వం తమ లోపాలను సరిదిద్ది కచ్చితమైన పరిహారాలు అందించాలని డిమాండ్ చేశారు.

# పులి నరేంద్రకుమార్‌రెడ్డికి ఘన సన్మానం



**కలికిరి, జూన్ 9, ప్రభాతవార్త:**

బీజేపీ అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షుడిగా పులి నరేంద్ర కుమార్‌రెడ్డిని బీజేపీ అధిష్టానం ఇటీవల నియమించింది. ఆయనకు బీజేపీ శ్రేణులు కలికిరిలో మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పులి నరేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిమ్మలపల్లి పురుషోత్తం, కలికిరి మండల పార్టీ అధ్యక్షుడు బాబు కుమార్‌రెడ్డి, మైనార్టీ మండల పార్టీ అధ్యక్షులు పటాన్ నూర్ మహ్మద్, పీపీ కృష్ణప్ప, రెడ్డప్ప, శ్రీను, అలకుంట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు అంగన్వాడీ పిలుస్తోంది





**వేంపల్లె జూన్ 09 ప్రభాతవార్త**

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక శ్రీరామనగర్ అంగన్వాడీ కేంద్ర పరిధిలో ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వి.సునిత మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల నిండిన పిల్లలకు తప్పక అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేయాలని, ఆటపాటలతో పాటు విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిడ్డ మెదడు అభివృద్ధి ఆరేళ్లలోనే 90 శాతం అభివృద్ధి చెందుతుందని, పిల్లలకు ప్రేరణాత్మకమైన, ఆరంభ అభ్యసనను ప్రారంభించాలని, దీనితో మెదడులోని న్యూరాన్ ల కనెక్టివిటీ పెరిగి మేధాభివృద్ధికీ ఉపయోగ పడుతుందన్నారు. ఆట, పాట, మాట అనే ఈ మూడు కార్యక్రమాల ద్వారా పిల్లల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు స్వర్ణలత, పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేను కలిసిన వైసీపీ నాయకులు

**కలికిరి, జూన్ 9, ప్రభాతవార్త:**

పీలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మంగళవారం వైసీపీ ప్రధాన కార్యదర్శి కంభం ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చింతలను కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం మెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ నాయకులు కలికిరిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ విషయంపై కలికిరి పోలీసులు వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ అక్రమ కేసులపై వైసీపీ నాయకులు బయపడవద్దని ఈ విషయం మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమాలపై మరింత పోరాటం జరపాలని వైసీపీ నాయకులు ప్రజల పట్ల పోరాడాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండలం వైసీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, గోపాల్, ఓబయ్య, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణపై

# ఫిర్యాదు పరిశీలించిన ఎమ్మార్వో



**సుండుపల్లె, జూన్ 09,ప్రభాతవార్త :**

మండల కేంద్రానికి సమీపంలోని నక్కల నారవ చెరువుభూమి ఎకర ప్రభుత్వ భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా ఆర్ఎంపీ డాక్టర్ ధనుంజయ రెడ్డి ఆక్రమించి బోర్లు వేసి చట్లను నాటి, చుట్టూ కంచి వేసి సాగు చేసుకుంటుండడంతో సోమవారం స్పందనలో ఫిర్యాదు చేయడంపై పై అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తాహసిల్దార్ వేణుగోపాల్, డిటి వినీత్ కుమార్ రెడ్డి, వీఆర్వో బస్సయ్యలు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తాహసిల్దారు వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలమే విచారణ చేపట్టి ఆక్రమణలు తొలగించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం వాడుకుంటామన్నారు.

# పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 9, ప్రభాతవార్త:**

పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ 3వసారి అధికారం కొనసాగిస్తూ ఈ మధ్యకాలంలో పెట్రోలు, డీజిల్‌పై ఒక్క లీటరుపై రూ.10 పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నదని ఈ పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు పెరగడం వలన నిత్యావసర వస్తువులన్నీ పెరిగిపోయి ప్రజలకు భారం కానున్నాయన్నారు. ఈ భారాలు మోయలేకున్నారని చైన్ లింకు మాదిరిగా అన్ని పెరుగుతాయని తెలిపారు. ధరలు తగ్గించి ప్రజలపై పడిన భారాన్ని తగ్గించాలన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు విజయకుమార్, సర్వేశ్వరి ఐద్వా, జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, ఐద్వా పట్టణ కార్యదర్శి జి.ప్రేమ, అధ్యక్షులు విజయకుమారి పుష్పలత, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షులు మేరీ బాబు ఆటో యూనియన్ కార్యదర్శి గోపాల్, ఏసు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## దేశ సంపద భవిష్యత్‌లో

# తరాన్ని నిర్మించే బాధ్యత మనపై ఉంది

**కలసపాడు, జూన్ 9 ప్రభాతవార్త:**

మండలంలోని అంగన్వాడి టీచర్లకు జడ్పీహెచ్ఎస్ బాయ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో సిడిపిఓ పి. జమీలాబి ఆధ్వర్యంలో మంగళవారం 0 నుండి 6 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ఏఐ ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్ పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ పిల్లలే దేశ సంపద భవిష్యత్ లో తరాన్ని నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని, 0 నుండి 6 సంవత్సరాల పిల్లల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదల నిర్ధారించుకోవడానికి అంగన్వాడి టీచర్లు స్క్రీనింగ్ చేపట్టాం చేపట్టడం జరిగిందన్నారు. మండల డాక్టర్ కె. సాయి తేజ మాట్లాడుతూ గర్భాధారణ నుండి చిన్నారులకు రెండేళ్ల వయసు వరకు అత్యంత కీలకమైన తొలి వెయ్యి రోజుల ప్రణాళిక అమల్లో అమలుతో ఆరోగ్యవంతమైన చిన్నారులకు సమాజానికి అందించవచ్చన్నారు. ఈ శిక్షణలో మండల అంగన్వాడి టీచర్లు సూపర్వైజర్లు టి. హరిప్రియ, డబ్ల్యు. చంద్రకళలు పాల్గొన్నారు.





# భీమా సహాయం అందజేత

**దువ్వూరు, జూన్ 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గుడిపాడులోని ఏపీ గ్రామీణ బ్యాంక్ తరఫున లబ్ధిదారులకు భీమా పరిహారాన్ని అందజేశారు. గుడిపాడుకు చెందిన చిట్టిబోయిన ఎల్లయ్య అనే వ్యక్తి గతంలో అనారోగ్యంతో మరణించాడు. అతనికి ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద 2 లక్షల రూపాయల చెక్కును బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఖాతాదారుడు 436 రూపాయలు చెల్లించి ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. అలాగే సురక్ష బీమా కింద 20 రూపాయలు, అటల్ పింఛన్ పథకాలను కూడా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ప్రశాంతి, శివ ప్రసాద్, రవి కుమార్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



# కలికిరిలో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

**కలికిరి, జూన్ 9, ప్రభాతవార్త:**

కలికిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం కలికిరి మండలం వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సురేశ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సురేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. పని ఒత్తిడి సందర్భంగా వీఆర్వో హుసేన్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రెవెన్యూ అధికారులపై పని ఒత్తిడి వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులపై పని ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సయిద్ అహ్మద్‌కు రెవెన్యూ అధికారులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీలు క్రమం తప్పక
# పౌష్టికాహారం తీసుకోవాలి



**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 9 ప్రభాతవార్త**

పట్టణంలోని వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో బాగంగా గర్భిణీలకు సమగ్ర ప్రసవ పూర్వ పరీక్షలను అందిస్తూ విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తిఅయినదని, ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్త లను మరియు క్రమం తప్పక డాక్టర్‌తో చెకప్స్ చేయించుకొంటూ వారి సలహాలను పాటిస్తూ పౌష్టికహార్ని తీసుకోవాలన్నారు. వైద్యాధికారి మధుకుమార్ మాట్లాడుతూ మన ప్రధాని మోడీ పీఎం ఎస్ఎంఏ ప్రారంభించి 10 సంవత్సరాలు అయిన సందర్భంగా మంగళవారం ఇక్కడ 29మంది గర్భిణీలకు రక్తపరీక్షలు, బిపి, వైద్యపరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ క్యాంపులో కోఆర్డినేటర్ ఎంవి సుబ్బారెడ్డి, యూపీహెచ్సి సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాల పునఃపరిశీలనలో
# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**పీలేరు జూన్ 9 ప్రభాతవార్త:**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃపరిశీలన, ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, బూత్ లెవల్ ఏజెంట్లు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఓటరు జాబితాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలి. తప్పుల సవరణకు, అనర్హులైనఓట్ల తొలగింపుకు, కొత్త ఓటర్ల నమోదుకు అధికారులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మంగళవారం ఆయన తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో పోస్ట్ చేశారు. ఓటరు జాబితా స్వచ్ఛందంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని, పారదర్శకమైన ఓట్ల జాబితాయే లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు.

## అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు



**వీరపునాయునిపల్లి జూన్ 09 ప్రభాతవార్త**

మండలంలోని అంగన్వాడీ టీచర్లకు సంగమేశ్వర హై స్కూల్ నందు ఒక్క రోజు ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ ట్రైనింగ్ కార్యక్రమానికి కమలాపురం సిడిపిఓ శ్రీలత పర్యవేక్షించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్‌కు వచ్చే పిల్లల యొక్క లోపాలను ఏ విధంగా గుర్తించాలి అనే వివరించారు అదేవిధంగా ఐసిడిఎస్ యొక్క లక్ష్యాలను ఆయన వివరించారు అదేవిధంగా నవ చైతన్య యాప్ను గురించి అంగన్వాడీ టీచర్లకు సూపర్వైజర్లు వివరించారు అనంతరం వైద్యాధికారితిదీబీదీ గురించి వివరించారు అదేవిధంగా పిల్లలకు మొబైల్ దూరంగా ఉంచాలని దీనిపై తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్లు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగు నీరు లేక అల్లాడిపోతున్న ప్రజలు



**బ్రహ్మంగారి మఠం జూన్ 09 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో గత 7 రోజులుగా మోటార్ చెడిపోయి త్రాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు కాలనీ ప్రజలు సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోగా ఎలాంటి స్పందన లేదు. మోటర్ చెడిపోయిన ప్రతి సారి నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి కాలనీలో ఉంది. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి అంబేద్కర్‌నగర్‌లో నీటి కష్టాలు తీర్చాలని లేనిపక్షంలో ప్రజలందరిని కలుపుకొని ఎం పిడిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ అధికారులను హెచ్చరించారు.

## 39 మంది గర్భిణీలలకు వైద్య పరీక్షలు

**దువ్వూరు, జూన్ 9, ప్రభాతవార్త:**



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద 39 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి సురేష్‌బాబు, హేమలత, రోహిణీలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు ప్రతీ నెల తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. 19 మంది కష్టతరమైన గర్భిణిలను గుర్తించి వారికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు తదితర వాటిని పరీక్షించి మందులను అందజేశారు. అంగన్వాడి కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అలాగే రాగిజావా, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. జననీ సురక్ష, ప్రధానమంత్రి మాతృత్వ యోజన తదితర వాటి ద్వారా లబ్ధి పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, శాంతకుమారి, శివ గంగరాజు, రవికుమార్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పెండ్లిమర్రి వద్ద రోడ్డు ప్రమాదం

**కలసపాడు, జూన్ 9 ప్రభాతవార్త:**



కలసపాడు మండలం పెండ్లిమర్రి సమీపంలోని పోరుమామిళ్లకలసపాడు ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం ప్రమాదం జరిగింది. పోరుమామిళ్ల వైపు బైక్‌పై వెళ్తున్న పుల్లారెడ్డిపల్లెకు చెందిన రామ్మోహన్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రామ్మోహన్‌కు తీవ్ర గాయాలై, రెండు చేతులు విరిగాయని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు వెంటనే అతడిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రకృతి వ్యవసాయ ప్రచార కరదీపికల ఆవిష్కరణ

### రైతులకు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**మదనపల్లె, జూన్ 9 ప్రభాతవార్త**

ఎల్ నిన్యో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ 2026, 27 ప్రచార కరదీపికలను మంగళవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు వాతావరణ మార్పులు, పంటల నిర్వహణ, నీటి వినియోగం, మిశ్రమ పంటలు, జీవ ఉత్ప్రేరకాల వినియోగం వంటి అంశాలపై సమయానుకూలంగా అవగాహన కల్పించడం అవసరమన్నారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టుల ద్వారా ఈ కరదీపికలను రైతులకు అందించి విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం విశ్లేషించి రైతులకు శాస్త్రీయ, ఆచరణాత్మక సూచనలు అందించాలన్నారు. డిజిటల్ వేదికలు, మొబైల్ యాప్‌లు, ఎస్ఎంఎస్, వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారా వ్యవసాయ సలహాలు రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, తేమ సంరక్షణ, నీటి నిర్వహణ, దేశవాళీ విత్తనాల వినియోగం, మిశ్రమ పంటల సాగు ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి. శివన్నారాయణ, సమాచార శాఖ ఏడి సీహెచ్. పురుషోత్తం, వ్యవసాయ శాఖ ఏవో నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్‌లో ఎస్‌బీవీఆర్ విద్యార్థుల సత్తా

**బద్వేలు, జూన్ 9, ప్రభాతవార్త**

బద్వేలు పట్టణంలోని బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ విషయాన్ని ఎస్‌బీవీఆర్ బి.ఎడ్ మరియు బి.పి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యు. శ్యాం సుందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట సుబ్బారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్. ఆదినారాయణ రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. చెన్నైలోని హిందుస్థాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జూన్ 3 నుంచి 8 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ వుమెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రేరణ ఆర్. సెల్వి 69 కిలోల విభాగంలో మొత్తం 560 కిలోల బరువు ఎత్తి స్వర్ణ పతకం సాధించారు. అదే విధంగా ఎస్‌బీవీఆర్ బి.ఎడ్ కళాశాల విద్యార్థి ధోనె మురళీకృష్ణ 59 కిలోల విభాగంలో 640 కిలోల బరువు ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకోగా, బి.పి.ఎడ్ కళాశాల విద్యార్థి సయ్యద్ ఖాజావలి 93 కిలోల విభాగంలో 835 కిలోల బరువు ఎత్తి రజత పతకాన్ని సాధించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను శ్రీ బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి కె. రితేష్ కుమార్ రెడ్డి అభినందించారు. అలాగే విద్యార్థుల విజయానికి కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందిని ప్రశంసించారు.




# సర్‌పై బూత్ స్థాయి అధికారులకు శిక్షణ






**బద్వేలు, జూన్ 9, ప్రభాతవార్త:**

భారత ఎన్నికల సంఘం, న్యూఢిల్లీ మరియు చీఫ్ ఎలెక్షన్ అధికారి, అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా ఎన్నికల అధికారి సూచనలతో ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమంపై బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లకు మంగళవారం బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ ద్వారా ఈ శిక్షణ అందించారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితాలో ఉన్న మృతులు, ద్వంద్వ ఓటర్లు, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు, వివాహం కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, వలస వెళ్లిన వారి వివరాలను సవరించేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసి, గుర్తించిన ఓటర్ల వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయనున్నారు. జూన్ 15 నుంచి జులై 14 వరకు 30 రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరుకు సంబంధిత వివరాలను అందజేయనున్నారు. అదే సమయంలో 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న కొత్త ఓటర్ల నమోదుకు కూడా అవకాశం కల్పించనున్నారు. మ్యాపింగ్ కాని ఓటర్ల జాబితాను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించి, వారు రెండు ఆధార పత్రాలు సమర్పించినట్లయితే వారి వివరాలను పరిశీలించి జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. అన్ని అభ్యంతరాలు, సవరణల ప్రక్రియ పూర్తయిన అనంతరం తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 22, 2026న ప్రచురించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బద్వేల్, పోరుమామిళ్ల తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మక ఆలోచనల ఆవిష్కరణకే ఐడియా లాబ్

### అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

**రాజంపేట, జూన్ 9 ప్రభాతవార్త**

విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతోనే రాజంపేట అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ను ప్రారంభించినట్లు అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన యూనివర్సిటీలో ఐడియా లాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు భవిష్యత్ సాంకేతిక రంగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఈ ల్యాబ్ ఎంతో దోహదపడుతుందన్నారు. దేశ అభివృద్ధికి యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచనలు అత్యంత అవసరమన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమాజ సమస్యలకు పరిష్కారాలను కనుగొనే దిశగా విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఈ. సాయిబాబా రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ ఐడియా ల్యాబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణ, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ ల్యాబ్ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఇంజినీరింగ్ విద్యను కేవలం పాఠ్యపుస్తకాల పరిమితిలో కాకుండా ప్రత్యక్ష అనుభవాధారిత బోధనతో మేళవించడం ఈ ల్యాబ్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధక విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఐడియా ల్యాబ్ ప్రారంభిస్తున్న చాన్స్‌లర్



పరిశీలిస్తున్న గంగిరెడ్డి, వైస్ ఛాన్సర్ సాయిబాబారెడ్డి

## అన్నీ తామై అంత్యక్రియలు

**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 9 ప్రభాతవార్త**

స్థానిక అమృతనగర్ లో గంటశాల రామలక్ష్మమ్మ అనే వృద్ధురాలు మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో స్థానికులు ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు స్పందించి మంగళవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబాహాన్, సతీష్, కిరణ్ కుమార్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. మేఐహెల్ప్యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే తమ ఫౌండేషన్ సంప్రదించ వలసిందిగా వారు కోరారు.



# తాగునీటి సమస్య లేకుండా చూడండి

### ఎంపీపీ బోధన బోయిన నిర్మల నారాయణ

**కలసపాడు, జూన్ 9 ప్రభాతవార్త:**



మండలంలో ప్రతి పంచాయతీలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ బోధన బోయిన నిర్మల నారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఇన్చార్జి ఎంపీడీవో చంద్ర మోహన్ ఆధ్వర్యంలోమండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీపీ నిర్మల నారాయణ మాట్లాడుతూ 13 గ్రామపంచాయతీలలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో జాతీయ రహదారుల నిర్మాణం, అభిరుద్ధి పెద్ద ఎత్తున జరుగుతుంది అని అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు, ఉపాధి హామీ, రైతులకు ఎరువుల సబ్సిడీ, వ్యవసాయ పరికరాలు, మహిళా సంక్షేమ పథకాలు, దేశ అభిరుద్ధి ఎన్నో కార్యక్రమములు కూటమి ప్రభుత్వం చేపట్టడం జరిగింది అని అన్నారు 12 ఏళ్ల మోడీ పరిపాలన సంక్షేమ పథకాలు వివరించడం జరిగింది అదేవిధంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి వారి నివేదికను మండల సమీక్షలు వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సొసైటీ చైర్మన్ కల్లూరి దుగ్గి రెడ్డి, ఉపమండల అధ్యక్షుడు అన్నా రెడ్డి విజయభాస్కర్ రెడ్డి అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు ఏవన్ శిక్షణ

**దువ్వూరు, జూన్ 9, ప్రభాతవార్త:**

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మంగళవారం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఏ వన్ స్క్రీనింగ్ టెస్ట్ పై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో చాపాడు సిడిపిఓ ముంతాజ్ బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వన్ సాంకేతిక వినియోగంతో పిల్లల అభివృద్ధి, క్లీనింగ్ ప్రక్రియలు, దాని ప్రాముఖ్యతను గురించి వివరించారు. దీని ద్వారా చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధి, సమస్యలు ప్రారంభ దశలోనే తెలుసుకోవచ్చు అన్నారు. చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. ఏ వన్ శిక్షణ నేర్చుకుని అంగన్వాడి పిల్లలకు మంచి కార్యక్రమాలు అందజేయాలని పేర్కొన్నారు. ఈ శిక్షణలో 59 మంది అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు వరలక్ష్మి, సౌజన్య, కళావతి పాల్గొన్నారు.




## ఇంటి నిర్మాణ పరికరాల దొంగలు అరెస్ట్

### - రూ.32వేలు విలువ చేసే వస్తువులు స్వాధీనం



**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 9, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరుకు చెందిన షక్ అబ్దుల్ సుబహాన్, మరో ముగ్గురు మైనర్ బాలురు చోరీలకు పాల్పడిన కేసులో అరెస్టు చేసినట్లు సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ముద్దాయిలను ఎర్రగుంట్ల సర్కిల్‌లో చోరీ సామాన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయిలు షేక్ అబ్దుల్ సుబహాన్(28), మరో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32వేలు విలువ చేసే కార్పెంట్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎర్రగుంట్ల–జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో గత నెల 17వ తేదీ రాత్రి కరెంటు వైర్లు, కటింగ్ మిషను, ఇనుప కడ్డీలు, అదే రోజు రాత్రి వన్‌టౌన్ పరిధిలోని మిగతా రెండు ప్రదేశాలలోని చెక్క పనికి వాడే పనిముట్లు అంటినీ దొంగతనం చేయడంతో బాధితుడు పెన్నానగర్‌కు చెందిన షేక్ సాదక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విచారణాధికారి శ్రీనివాసులు వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## డంపింగ్ యార్డ్‌కు
# స్థలాన్ని కేటాయించండి

**వేంపల్లె జూన్ 09 ప్రభాతవార్త**

పంచాయతీ పరిధికి సంబంధించిన చెత్త చెదారాన్ని స్థానిక పాపాగ్నినది, కడప బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో వేయడం వల్ల ప్రజలు రోగాన బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో చెత్త చెదారాన్ని వేసేందుకు ఒక స్థలాన్ని కేటాయించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ ధృవకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ శివశంకర్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో చెత్త చెదారాన్ని వేసేందుకు పాములూరు రహదారి ప్రాంతంలోని గుట్టపై స్థల సేకరణ చేశారని, అయితే పారిశుధ్య సిబ్బంది మాత్రం పాపాగ్నినది, కడప బైపాస్ రోడ్డు ప్రాంతంలో వేస్తున్నట్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పాపాగ్నినదిని చాలా మంది ఆక్రమించుకొని విచ్చలవిడిగా బోర్లు వేసుకున్నారని ఆరోపించారు. రైతులకు సాగునీరు, ప్రజలకు త్రాగునీరు కష్టంగా మారిందన్నారు. వీటన్నింటిపై దర్యాప్తు చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, రామకృష్ణ, రామాంజనేయులు రెడ్డి, వెంకటేష్, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య, వేమారాజ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన నాగరప్పమ్మ జాతర



**సుండుపల్లి, జూన్ 09, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని పెద్దినేని కాలువ ఈడిగపల్లెలో వెలసి ఉన్న శ్రీ నాగరప్పమ్మ అమ్మవారి జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసింది. జాతర సందర్భంగా పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. మొక్కుబడిలో భాగంగా భక్తులు అమ్మవారికి విద్యుత్ దీపాలంకరణతో చాంది బండి కట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా భక్తులు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయడంతో జాతర ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరకు ప్రత్యేక శోభ తీసుకువచ్చారు.

## బీఎల్ఓలు బాధ్యతగా నిర్వహించాలి



**కలికిరి, జూన్ 9, ప్రభాతవార్త:**

మండలంలోని పంచాయతీలలో ఈ నెల 15 నుంచి జులై 14 వరకు చేపట్టనున్న ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని బీఎల్ఓలు బాధ్యతగా నిర్వహించాలని తహసీల్దార్ సయిద్ అహ్మద్ బీఎల్ఓలను ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. అదే విధంగా బీఎల్ఓలు ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హుల ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు సరిచేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీఎల్ఓలు తమకు కేటాయించిన సర్వే కార్యక్రమాన్ని బాధ్యతగా చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా బీఎల్ఓలు విధులు నిర్వహించాలన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ బీఎల్ఓలకు కిట్లు పంపిణీ చేశారు.